క్లుప్తంగా

నిడమానూరు మసీదులో అంజాద్‌బాషా ప్రార్థనలు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని మినార్ మసీదులో శుక్రవారం జరిగిన నమాజ్ ప్రార్థనల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పాల్గొన్నారు. అంజాద్‌బాషా గన్నవరం విమానాశ్రయానికి వెళ్తుండగా నమాజ్ సమయం కావడంతో దారిలో ఉన్న ఈ మసీదులో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషాకు గ్రామంలోని ముస్లిం మత పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ సచివాలయ కన్వీనర్లు పరిమి సింధు, బొగ్గవరపు రాజేంద్రప్రసాద్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు



కంకిపాడు: దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి రామారావు సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా మంతెన గ్రామంలో ఆయన శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. వైద్య,ఆరోగ్య సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించారు. దోమల వల్ల వ్యాపించే వ్యాధులపై ప్రజ లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చేసి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. మలేరియా యూనిట్ అధికారి శ్రీనివాసరావు వైద్య సిబ్బంది కెనడి, ఆశాజ్యోతి, నీలిమ పాల్గొన్నారు.

రెండు వర్గాలపై కేసులు

పెనమలూరు: పరస్పరం దాడులు చేసుకున్న రెండు వర్గాలపై పెనమలూరు పోలీసులు శుక్రవారం కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కానూరు మైత్రినగర్‌కు చెందిన బి.సాయివిక్రమ్‌రెడ్డి కేసీపీకాలనీ వద్ద డెయిరీ షాపులో జున్ను కొన్నాడు. జున్ను నాణ్యంగా లేదని తిరిగి ఇవ్వబోగా తీసుకునేందుకు షాపు యజమాని యనమదల సాయిపవన్ నిరాకరించడంతో వారి మధ్య వివాదం తలెత్తింది. తనపై యనమదల సాయిపవన్, అతని మిత్రులు జి.ఆంజనేయులు, ప్రభాకరరావు దాడి చేశారని బాధితుడు సాయివిక్రమ్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై సాయివిక్రమ్‌రెడ్డి, నాగమహేంద్ర దాడి చేశారని షాపు యజమాని సాయిపవన్ కూడా ఫిర్యాదు చేశాడు. ఈ రెండు ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కంకిపాడు: ఏసీసీ ఇండియన్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కంకిపాడు ఎస్ఎస్ ప్రజ్ఞ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాల కరస్పాండెంట్ ఎస్.లక్ష్మి, ప్రిన్సిపాల్ ఎప్. నిహార్ శుక్రవారం ఈ వివరాలు తెలిపారు. ఈ నెల 19వ తేదీన వేమవరంలో నిర్వహించిన కరాటే పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వ్యక్తిగత కాటా విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలిచారన్నారు. ఇటీవల జరిగిన మరో జాయతీస్థాయి కరాటే పోటీలో విద్యార్థులు ఎనిమిది బంగారు, ఏడు రజతం, ఒక కాంశ్య పతకం గెలిచారని వివరించారు. కోచ్ హేమంత్ పాల్గొన్నారు.

సప్తమ వార్షికోత్సవాలు ప్రారంభం

పెనమలూరు: మండలంలోని పెదపులిపాకలో ఉన్న శ్రీ విజయరాజరాజేశ్వరి సమేత శ్రీ విజయసుందరేశ్వరస్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం వాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీమహాగణపతి పూజ, స్వామివార్లకు అభిషేకాలు, విశేష అలంకరణలు జరిగాయి. అనంతరం శ్రీలలితా సహస్రనామ కోటి కుంకుమార్చన నిర్వహించారు. తొమ్మిది మంది పీఠాధిపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి, మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నెలాఖరుకు 90 శాతం సర్వే పూర్తిచేయాలి

విజయవాడరూరల్: ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద ఆయూష్మాన్ భారత్ కార్డు అందచేయడానికి ఈ–కేవైసీ సర్వేను ఈ నెలాఖరు నాటికి 90 శాతం పూర్తి చేయాలని ఎంపీడీఓ బి.భార్గవి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయాల గ్రేడ్–5 కార్యదర్శుల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో 82 శాతం ఎస్‌డీజీ సర్వే పూర్తి చేసిన అంబాపురం మండలంలోనే ముందంజలో ఉందన్నారు. ఓవరాల్‌గా మండలంలో 63 శాతం సర్వే పూర్తయిందని వివరించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశాల మేరకు.. ఈ నెలాఖరు నాటికి అన్ని గ్రామాల్లో సర్వే 90 శాతం పూర్తికావాలన్నారు. ఈఓఆర్డీ బి.వి.శేషగిరిరావు పాల్గొన్నారు.

వేదిక ఏదైనా విజయ వికాసమే!

- ఏడేళ్ల ప్రాయంలోనే సత్కారాలు, జ్ఞాపికలు, మెడల్స్, పురస్కారాలు
- మూడున్నరేళ్ల నుంచే వేదికలపై సత్తా చాటిన చిన్నారి
- తల్లి మైథిలి గురువుగా విజయాల పరంపర



అమరావతి బాలోత్సవంలో అతిథుల నుంచి సత్కారం పొందిన వికాస్ (ఫైల్)

గన్నవరం రూరల్: పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్న సామెతను ఈ బాలుడు నిజం చేస్తున్నాడు. గన్నవరం మండలం సావరగూడెంనకు చెందిన లంకా మైథిలి, వెంకట గంగాధరరావు దంపతుల కుమారుడు వికాస్‌కు ఏడేళ్లు. తన ప్రతిభతో అందరినీ అబ్బురపరుస్తున్నాడు. మూడేళ్ల వయసు నుంచే తనలోని సృజనను వెల్లడించడం ప్రారంభించాడు.

ఇల్లే వేదిక.. తల్లే గురువు

వికాస్‌లోని సునిశిత పరిశీలనా జ్ఞానాన్ని, ఏకసంధాగ్రాహి లక్షణాలు, పట్టుదల, ప్రశ్నించే తత్వాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. ఇల్లే వేదికగా కుమారుడికి శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. తల్లి మైథిలి పర్యవేక్షణలో సామాజిక అంశాలపై ప్రజల్ని చైతన్యవంతం చేస్తూ పలు వీడియోల్లో వికాస్ ప్రసంగించాడు. యూట్యూబ్ ద్వారా లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నాడు.

అనేక అంశాలపై పరిజ్ఞానం

వేదాలు, శ్లోకాలు, పద్యాలు, భగవద్గీతతో పాటు ఆయా ఖండాల్లో ఉన్న దేశాల పేర్లు, రాజధానులు, రాష్ట్రాలు, వాటి రాజధానులు, జిల్లాలు, ఆయా దేశాల కరెన్సీ, వివరాలు కంఠోపాఠంగా చెప్పడంలో వికాస్ ఘనాపాటి. సామాజిక అంశాలను వివరించి ప్రజలను చైతన్యవంతం చేసేందుకు విచ్చలవిడి రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్లాస్టిక్ పొల్యూషన్‌తో ప్రపంచం నష్టపోయే పరిస్థితులు, భారతదేశంలో అగ్రికల్చర్ కాపాడుకోవాల్సిన అవసరం వివరించారు. కరోనా టీకాపై ప్రచారం చేస్తూ రూపొందించిన వీడియోలు ఆకట్టుకున్నాయి. పూజ్య బాపూజీ గాంధీజీ, స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే గొప్పతనం, బాలల హక్కులపై ప్రసంగాలు చేశాడు. కెమిస్ట్రీ ల్యాబ్‌లో ఉన్న 118 ఎలిమెంట్స్ గుణగణాలు విశ్లేషిస్తాడు. ప్రారంభం నుంచి మనదేశ ప్రధానులు, అధ్యక్షుల పేర్లు వివరిస్తాడు. రూబిక్స్‌ను సాల్వ్ చేయటం, యూట్యూబ్‌లో తెలుసుకుని స్కేటింగ్ నేర్చుకున్నాడు. జనవిజ్ఞాన వేదికలపై పాల్గొని గాజు పెంకులపై నడిచి చూపించాడు. ప్రపంచ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీల్లో 1800 మంది పాల్గొనగా వికాస్ రాష్ట్ర స్థాయిలో ప్రథముడిగా నిలిచాడు.

ఎన్నో పోటీల్లో విజేతగా....

వేదిక ఏదైనా వికాస్ విజయం సాధించేవాడు. మొట్టమొదట గన్నవరం బ్రాహ్మణ పరిషత్ వేదికగా నిర్వహించిన పోటీల్లో పాల్గొని భగవద్గీత ఉపన్యాసంలో పండితులను అబ్బురపరిచాడు. అప్పటికీ కేవలం మూడున్నర సంవత్సరాల వయస్సున్న వికాస్ ఆనాటి నుంచి విజయవాడ ఘంటసాల సంగీత కళాశాల, ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల పర్యాటక అభివృద్ధి శాఖలు ఏర్పాటు చేసిన భాషా సాంస్కృతిక వేదికపై ఉగాది పురస్కారం, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా, అమరావతి బాలోత్సవంలో అభినందన జ్ఞాపికలు, అబాకస్ స్పీడ్ మ్యాథ్స్‌లో రన్నర్‌గా, రిపబ్లిక్‌డే సందర్భంగా ఎస్ఆర్‌కే ఫౌండేషన్ నిర్వహించిన దేశభక్తి ఉపన్యాసాల్లో విన్నర్‌గా, హరేకృష్ణ మూవ్‌మెంట్ వారు నిర్వహించిన పోటీల్లో భాగవత ఉచ్చారణ పోటీల్లో సత్తా చాటాడు. బాలరత్న పురస్కారం ఆచార్య గుమ్మా సాంబశివరావు చేతుల మీదుగా అందుకున్నాడు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్‌లు రంజిత్ బాషా, ఢిల్లీరావు వికాస్ ప్రతిభను మెచ్చుకున్నారు.

పెద్దల ఆశీర్వాదం.. ప్రశంసల వర్షం

వెదురుపావులూరు సెయింట్ జోసఫ్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న వికాస్ ప్రతిభ పాటవాలకు పాల్గొన్న వేదికలపై ప్రశంసలు లభించాయి. జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, మెడల్స్ ఎన్నో సొంతం చేసుకున్న వికాస్ ప్రతిభకు తల్లి మైథిలి నిరంతరం పదును పెడుతున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా తీర్చిదిద్దుతున్నారు. లంకా వికాస్ ఇంతింతై వటుడింతై ఎదగాలని అతడిని సత్కరించి, అభినందించిన వారందరూ ఆకాంక్షిస్తున్నారు.

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



సీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కంకిపాడులో నాబార్డు నిధులు రూ.4.60 కోట్లతో నిర్మించిన అక్కినేని గోపాలకృష్ణమూర్తి, సుగుణ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే పార్థసారథి శుక్రవారం ప్రారంభించారు. తొలుత స్థల దాత అక్కినేని గోపాలకృష్ణమూర్తి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. చిన్న వైద్యం కోసం కూడా విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్న నేపథ్యంలో కంకిపాడులో ఆధునిక వసతులతో నూతన సీహెచ్‌సీ భవనం నిర్మించామన్నారు. స్థల దాత వితరణతో రూ.20 కోట్ల విలువైన భూమి సీహెచ్‌సీకి అందుబాటులోకి వచ్చిందన్నారు. సీహెచ్‌సీలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని స్పష్టంచేశారు.

చర్చకు సిద్ధం

రాష్ట్రంతోపాటు పెనమలూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని, ప్రతిపక్షాలకు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే పార్థసారథి సవాల్ విసిరారు. టీడీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 7,458 ఆస్పత్రులు ఉంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో వటి సంఖ్య 10,042లకు చేరిందని తెలిపారు. టీడీపీ పాలనలో వైద్య రంగానికి రూ.8400 కోట్లు కేటాయిస్తే, తమ ప్రభుత్వం రూ.15,800 కోట్లు వెచ్చిస్తోందని వివరించారు. ప్రతిపక్ష నేతలు అర్ధరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కంకిపాడు కేంద్రంగా డయాలసిస్ యూనిట్‌ను అందుబాటులోకి తెస్తామని, అవసరమైన నిధులు కేటాయించేలా చూస్తామని వివరించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ ఇందిరా దేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ బాకీ రమణ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు రామినేని రమాదేవి, ఈడే చాముండేశ్వరి, నందిపాటి బిందుమాధవి, జగనన్న సచివాలయాల మండల ఇన్‌చార్జి రాచూరి చిరంజీవి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ చైర్మన్ సత్తా వెంకటేశ్వరరావు, దాత అక్కినేని గోపాలకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేంద్రం న్యాయం చేయాలి



తాడిగడపలో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

పెనమలూరు: రాష్ట్రానికి ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యుడు ఆర్.రఘు డిమాండ్ చేశారు. తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. రాష్ట్రానికి వెంటనే ప్రత్యేక హోదా ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తిచేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సొమ్ము పెట్టుబడి వర్గాలవారికి దోచి పెడుతోందని ఆరోపించారు. ప్రజలపై ఆర్థిక భారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ నేతలు షేక్ కాశీం, ఉప్పాడ త్రిమూర్తి, అమరయ్యశాస్త్రి, రాజేశ్వరరావు, జె.వెంకటేశ్వరరావు, అన్నవరపు శ్రీనివాసరావు, నారిన వెంకట్రావు, వీసం రమణమ్మ పాల్గొన్నారు.

రామాలయాలకు ఎమ్మెల్యే రూ.4 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

గన్నవరం: ఉంగుటూరు మండలం నాగవరప్పాడులో రెండు రామాలయాలు నిర్మాణం నిమిత్తం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.4 లక్షల విరాళం ఇచ్చారు. స్థానిక కార్యాలయంలో ఉంగుటూరు ఎంపీపీ వడ్లమూడి సరోజిని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, కన్వీనర్ వింత శంకరరెడ్డి, గుడిసె బాలస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి చేతుల మీదుగా విరాళం నగదును ఆలయ కమిటీలకు శుక్రవారం అందజేశారు. ఆ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ కోదండ రామాలయం, తుది దశ పనుల్లో ఉన్న శ్రీ సీతా రామాలయం కమిటీలు ఇటీవల వంశీమోహన్‌ను కలిసి ఆర్థిక సాయం కోరాయి. శ్రీ కోదండ రామాలయానికి రూ.3 లక్షలు, శ్రీ సీతారామాలయానికి రూ.లక్ష చొప్పున ఎమ్మెల్యే విరాళం ఇచ్చారు. అడిగిన వెంటనే ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే వంశీమోహన్‌కు ఆలయ కమిటీలతో పాటు ఆ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు రామిశెట్టి వెంకటేశ్వరరావు, గొన్నూరు సీమయ్య, మెండెం రాంబాబు, గుదె ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. శుక్రవారం 1,820 మంది కూలీలు ఈ పనుల్లో పాల్గొన్నారు. రైతులకు ఉపయోగపడేలా పంట కాలువల తవ్వకం పనులు ఎక్కువగా జరుగుతున్నా యని ఏపీఓ సత్యప్రియ తెలిపారు. రబీ సీజన్ కావటంతో మెట్ట ప్రాంత గ్రామాల్లో పంట కాలువల తవ్వకానికి అనువైన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఉపాధి పనుల్లో కూలీలు మరింతగా పాల్గొనాలని కోరారు.

నాలా భూముల పరిశీలన

విజయవాడరూరల్: మండలంలోని పాతపాడు గ్రామంలో వ్యవసాయేతర భూములుగా మార్పు కోసం వచ్చిన దరఖాస్తుల మేరకు ఆయా భూములను తహసీల్దార్ పి.జాహ్నవి శుక్రవారం పరిశీలించారు. పాతపాడు, సీతారామపురం గ్రామాల్లో సర్వే నంబర్లు 178/6లో రెండు ఎకరాలు, 360/3లో 27.5 సెంట్లు, 361/3లో 34.5 సెంట్లు, 310/2లో 54 సెంట్లు భూములను పరిశీలించారు. మండల సర్వేయర్ రమేష్, వీఆర్వో రఘుబాబు పాల్గొన్నారు.

110 మందికి నేత్ర పరీక్షలు

కంకిపాడు: మండలంలోని ఉప్పులూరు గ్రామంలో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరం నిర్వహించామని ఆప్తమాలిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ తెలిపారు. వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్–3లో భాగంగా 60 సంవత్సరాలు దాటిన 110 మందికి అవ్వాతాతలకు కంటి పరీక్షలు ఉచితంగా చేశామని పేర్కొన్నారు. మందులు కూడా ఉచితంగా ఇచ్చామని తెలిపారు. శుక్లాలు ముదిరిన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయటానికి రిఫర్ చేశామని పేర్కొన్నారు. శుక్లాలు ఉన్న వారు వెంటనే ఆపరేషన్ చేయించుకుంటే మంచిదని సూచించారు.

400 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రాథమిక దశలోనే కంటి సమస్యలకు చికిత్స చేయిస్తే మెరుగైన చూపు పొందొచ్చని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ఎండీ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం సూచించారు. బాపులపాడు మండలం బొమ్ములూరులోని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ 3వ యూనిట్ ప్రాంగణంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల (వేమగిరి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి వైద్య నిపుణులు షేక్ కరీం, జి.సునీత, ప్రవీణ్ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 200 మందికి కళ్లజోళ్లు, మరో 25 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, అడుసుమిల్లి నిర్మల, బి.వి.వి.సుబ్రహ్మణ్యం, పాలవరపు రత్నాకరరావు, దేవినేని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు



నిందితులతో ఎస్ఈబీ పోలీసులు

ఉయ్యూరు: గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఉయ్యూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎండీ ఖదీర్ ఈ కేసు వివరాలను శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కంకిపాడుకు చెందిన దానాల రవితేజ, ఉయ్యూరుకు చెందిన షేక్ షానావలి, నంది కమల్, కంకిపాడు మండలం వేల్పూరుకు చెందిన పామర్తి హేమకుమార్ గంజాయి తాగడంతోపాటు విక్రయిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఉయ్యూరులో అరెస్టు చేసి, వారి వద్ద 290 గ్రాముల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్ఈబీ సీఐ ఎండీ ఖదీర్ తెలిపారు. ఎస్ఐలు జె.యుగంధర్‌రావు, పి.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలి



ప్రసంగిస్తున్న అమర్‌నాథ్

పెనమలూరు: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం పెంచుకోవాలని హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ హెడ్ ఫర్ ఎంటర్‌ప్రైజ్ క్లోడ్ యాప్స్ వైస్ ప్రెసిడెంట్ అమర్‌నాథ్ జూలూరి సూచించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎఫోసిక్–2023 జాతీయ స్థాయి సాంకేతిక, సాంస్కృతిక పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు మారుతున్న సాంకేతిక అభివృద్ధికి అనుగుణంగా చదివి లక్ష్యం సాధించాలని సూచించారు. టెక్ మహీంద్ర వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.రవిచంద్ర మాట్లాడుతూ.. విద్యార్థులు నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.వి.రత్నప్రసాద్ మాట్లాడుతూ.. ఎఫోసిక్ పోటీల్లో దేశవ్యాప్తంగా దాదాపు రెండు వేల మంది విద్యార్థులు పాల్గొంటున్నారని వివరించారు. పారిశ్రామికవేత్త త్రివేణి బొంతు, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు, కాలేజీ కన్వీనర్ మలినేని రాజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాపులపాడు జెడ్పీ పాఠశాలలో డీఈఓ తనిఖీలు



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థులు హైస్కూల్ దశలోనే భవిష్యత్ నిర్లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానికి అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదవాలని జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా అన్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌ను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం అమలుపై విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో డీఈఓ మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మండలంలోని జెడ్పీ హైస్కూళ్ల హెచ్ఎంలు తోట వెంకటనాగేశ్వరరావు, ఎస్.లూథర్ పాల్, కొమ్మా విజయ్, ఝాన్సీలక్ష్మి, సీహెచ్.సుబ్బారావు, ఎ.కృష్ణారావు, బి.సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశలో జాగ్రత్తలు పాటించాలి

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కౌమార దశలో తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సదస్సు జరిగింది. మోటివేషనల్ స్పీకర్ మధువంతి మాట్లాడుతూ.. కౌమార దశలో మంచి ఆహార, ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తే మానసిక, శరీరక ఎదుగుదల సాధ్యమన్నారు. రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ చిన్ని మాధవి, హెచ్ఎం సీహెచ్.అనిత తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ ఓటమితోనే పేదలకు న్యాయం’

గన్నవరం: కేంద్రంలో బీజేపీ ఓడిపోతేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుబాటులోకి వస్తాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కోత విధించడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ఆగిరిపల్లి రోడ్డులో శుక్రవారం ధర్నా చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రభుత్వ సంస్థలు ప్రైవేట్ పరమవుతున్నాయని వెంకటేశ్వరరావు ఆరోపించారు. సంక్షేమ పథకాల్లో కోతలు పెడుతూ పేదలకు అన్యాయం చేస్తోందని ధ్వజమెత్తారు. పార్టీ నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, మిరప నాగేశ్వరరావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు ప్రసాదంపాడు కాపురస్తులైన బండి రాంబాబు గారి కుమారుడు నాగరాజు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా నా క్లయింటు బండి నాగరాజుకు ఓగిరాల గ్రామం తాలూకు రీ.స.నెం. 150/2లో య. 1.00 సెంట్లు భూమి తన తండ్రి రాంబాబు వ్రాయించి యిచ్చిన దఖలు ది. 26-02-1990 ద్వారా సంక్రమించియున్నదని సదరు దస్తావేజు ది. 7-2-2023న అరుగొలను రాగా మార్గం మధ్యలో జారిపోయినది అట్లాగే తన అమ్మమ్మ గారైన సర్రా వెంకట పున్నమ్మ గారు ఓగిరాల గ్రామం తాలూకు ఆర్.యస్.నెం. 148/3లో య. 0.50 సెంట్లు భూమిని నా క్లయింటు ది. 26-02-1990 రిజిష్టర్ సెటిల్‌మెంట్ ద్వారా దఖలు పర్చినదని. అయితే సదరు ఒరిజినల్ దస్తావేజులు ది. 17-02-2023న ఆరుగొలనులో జారి పోయినవని, ఎంత వెతికినను కనిపించలేదనియు అందువలన నా క్లయింటు తాలుకు 26-02-1990 రెండు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు తెచ్చి ఇవ్వగలరని ప్రార్థన

హనుమాన్‌జంక్షన్
ది. 23-02-2023

లింగంనేని రాజారావు,
M.com, M.Phil, MA, LL.B,
అడ్వకేట్ & నోటరీ,
హనుమాన్‌జంక్షన్ - 521105
సెల్: 94401 50988

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు గన్నవరం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని గుణదల ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్యాస్ కంపెనీ రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, దావాజిగూడెం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, పాత ఎస్‌బీఐ రోడ్డు, మండల పరిషత్ కార్యాలయం రోడ్డు, విద్యానగర్, సుబ్బారావునగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఎనికేపాడులో..

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. లైన్‌ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం కేవీఆర్ కాలనీ, పంచాయతీ కార్యాలయం, శివాలయం, యూనియన్ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతుందని వివరించారు.

ప్రకటన

మా క్లయింటు విజయవాడ, యనమలకుదురు, ఎన్.టి.ఆర్. గార్డెన్స్ ఎదురు, పాత గ్రామ పంచాయితీ వీధి కాపురస్తులు బుద్దా రాజారావు గారి కుమారుడు బుద్దా పూర్ణచంద్రరావు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలాస్తిని విజయవాడ, ప్రసాదంపాడు, డోరు నెం. 9-178 కాపురస్తులు పున్నాన సత్యం గారి కుమారులు పున్నాన అప్పారావు, పున్నాన రమణ అను వారి నుండి కొనుగోలుచేయుటకు నిర్ణయించుకొని వారితో విక్రయ ఖరారు పడి కొంత సొమ్మును బయానాగా చెల్లించి యున్నారు. షెడ్యూలు దాఖలా స్థిరాస్తి సదరు అంగిరేకుల మాధవరావు, తండ్రి: విష్ణువర్ధనరావు గారి వద్ద నుండి ది. 10-01-2019న విజయవాడ తూర్పు సబ్ రిజిష్ట్రారు వారి కార్యాలయములో రిజిష్టరు కాబడిన దస్తావేజు నెం. 330/219 ద్వారా పొంది సదరు ఆస్తిని సర్వ స్వాధీన హక్కుభుక్తములతో అనుభవించుచున్నారని తెలిపియున్నారు. కావున షెడ్యూలు దాఖలా స్థిరాస్తిపై ఎవరికైనను ఏ విధమైన అభ్యంతరములు, తనఖాలు, కోర్టు జప్తులు, హామీలు, బ్యాంకు ష్యూరిటీలు, భాగలబ్ధ తగాయిదాలు, హక్కులు, వగైరా ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు తగు ఆధారములతో వ్రాతపూర్వకముగా ఈ దిగువ అడ్రస్సుకు రిజిష్టరు పోస్టు ద్వారా తెలియపరచగలరు. సదరు గడువులోపు ఎవరి నుండైనా ఏ విధమైన అభ్యంతరములు, వగైరాలు రానియెడల నా క్లయింటు షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి పైన తెలిపిన వారి నుండి రిజిష్టరు విక్రయ దస్తావేజు ద్వారా పొందగలరు. గడువు అనంతరం వచ్చే అభ్యంతరములు, వగైరాలు నా క్లయింటును గానీ, సదరు ఆస్తిని గానీ బైండు చేయజాలవు

షెడ్యూలు: కృష్ణాజిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిష్ట్రారు వారి యిలాకా, ప్రసాదంపాడు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన, ప్రసాదంపాడు గ్రామం, గ్రామ రీ సర్వే నెం. 65/9కు, పాత డోరు నెం. 9-3కు, ప్రస్తుత డోరు నెం. 20-156కు, అసెస్మెంటు నెం. 5502కు దాఖలా స్థిరాస్తికి హద్దులు. తూర్పు: అంగిరేకుల రామకృష్ణ గారి ఆస్తి ఆ. 25-0లు, దక్షిణం: అంగిరేకుల శ్రీనివాసరావు గారి ఆస్తి ఆ 14-10లు, పడమర: పంచాయితీ బజారు ఆ. 24-9లు, ఉత్తరం: అంగిరేకుల గంగాధరరావు గారి ఆస్తి ఆ 15-1లు.

యీ నాలుగు హద్దుల మధ్య చ.గ.41.4లు లేక చ.మీ. 34-6క్ష స్థిరాస్తి నివేశన స్థలము, అందలి గ్రౌండ్ ఫస్టు ఫ్లోర్లుగా గల ఆర్.సి.సి. డాబా యింటి కట్టడములు, అందుకు సంబంధించిన యావత్తిష్ట కలప వగైరా సామాను సహా, యిందలి ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, సర్వీస్ హక్కు దాని సెక్యూరిటీ డిపాజిట్ సహా, యిందలి లెట్రిన్, బాత్రూమ్, బోరింగ్ పంపు సహా, యావత్తు వసతులు సహా, యావత్తు యీజిమెంట్ హక్కులతో సహాయున్నా సదరు ఆస్తిపై నాకు గల యావత్తు యీజిమెంట్ హక్కులతో సహా..

విజయవాడ
ది. 23-02-2023

యం. రామనాథ్, అడ్వకేట్
డోరు నెం. 29-1-21, గవర్నరుపేట,
విజయవాడ-2. సెల్: 94401 50558.

రబీ పంటలు ఈ-క్రాప్‌లో నమోదు చేయాలి

గన్నవరం రూరల్: మండలంలోని రైతులు అందరూ రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు, ఈ–కేవైసీ చేయించాలని హార్టీకల్చర్ మండల అధికారి హరిచంద్ సూచించారు. ఈ నెల 28వ తేదీలోగా ఈ–క్రాప్, ఈకేవైసీ పూర్తి చేయాలని స్పష్టంచేశారు. పంటల వివరాలు నమోదు చేయడం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచే ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి ధ్వజస్తంబ ప్రతిష్ట కార్యక్రమాన్ని తిలకించారు. అర్చకుడు ఆరికపల్లి వెంకటశాస్త్రి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణ నడుమ క్రేన్ సాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

భక్తిశ్రద్ధలతో కోటయ్యస్వామి ఉరుసు



గన్నవరం: స్థానిక కొత్తపేటలోని శ్రీ కోటయ్య స్వామి ఆలయంలో శుక్రవారం ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గన్నవరం పట్టణ కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూసల, కృష్ణబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కోలా భవాని మణికంఠ, కృష్ణబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోలా అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీసం శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు అత్తులూరి మల్లికార్జునరావు, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు కోటయ్య స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. స్వామి సన్నిధిలోని లడ్డూ ప్రసాదాన్ని వేలంలో వీసం శ్రీనివాసరావు దంపతులు దక్కించుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కోటయ్యస్వామిని ఊరేగించారు. కృష్ణబలిజ సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడు వీసం ప్రసాదరావు, నందిగామ సంఘం అధ్యక్షుడు వీసం గోపాలకృష్ణ, పలువురు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.